సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం। 31। జూలై। 2023



టూరిజం బోటు బోల్తా 8లో

రుషికొండ బీచ్‌లో ఇద్దరు సందర్శకులు జాలీగా బోటులో షికారు చేస్తుండగా.. అలల ఉధృతికి సముద్రంలో బోల్తా పడింది.



నిఘా మరింత కట్టుదిట్టం

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసు బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. 8లో



కొత్తగా 13 డీసీసీబీ బ్రాంచిలు

విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలను విస్తృతం చేస్తూ..వ్యాపార లక్ష్యాన్ని పెంచుకుంటోంది. 8లో

సీఎం జగన్ నగర పర్యటన రేపు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగస్ట్ 1వ తేదీ మంగళవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 10 గంటలకు గన్నవరం విమానాశ్రయంలో బయలుదేరి 10.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10.55 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 11.15 గంటలకు సాలిగ్రామపురంలో నిర్మించనున్న ఇనార్బిట్‌మాల్ స్థలానికి చేరుకుంటారు. అక్కడ మాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. అనంతరం హైటీలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అదే ప్రాంగణంలో జీవీఎంసీకి చెందిన 50 పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. 12.25 గంటలకు అక్కడి నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి సిరిపురంలోని ఏయూ క్యాంపస్‌కు 12.40 గంటలకు చేరుకుంటారు. ఫార్మా ఇంక్యుబేషన్ సెంటర్(ఎలిమెంట్)తో సహా ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన భవనాలను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి 12.50కి బయలుదేరి బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంటారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో విశ్వవిద్యాలయం విద్యార్థులతో సీఎం ఇంటరాక్ట్ అవుతారు. మధ్యాహ్నం 1.20 గంటలకు బీచ్‌రోడ్డు నుంచి బయలుదేరి 1.40కు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 1.50 గంటలకు విశాఖ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయలుదేరి వెళ్లనున్నారు.

ఇనార్బిట్‌మాల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తి



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

తాటిచెట్లపాలెం (విశాఖపట్నం): సాలగ్రామపురం పోర్టు ఆస్పత్రిలో సమీపంలో ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, అధికారులతో కలిసి ఆదివారం ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. శంకుస్థాపన ప్రాంగణం, పార్కింగ్, వేదిక, రెస్ట్ రూం తదితర పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం పక్కాగా ఉండాలని, ఎక్కడా వ్యర్థాలు లేకుండా పర్యవేక్షించాలని ఆరోగ్య విభాగం అధికారులకు సూచించారు. ఆయన వెంట జీవీఎంసీ అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఇనార్బిట్‌మాల్ ప్రతినిధులు ఉన్నారు.

వీడని ముంపు.. సాయం ముమ్మరం

విలీన మండలాల ప్రజలకు వణుకు పుట్టించిన గోదావరి, శబరినదులు ఎట్టకేలకు శాంతించాయి. శనివారం అర్ధరాత్రి నుంచి గోదావరి, ఆదివారం మధ్యాహ్నం నుంచి శబరినది వరద తగ్గుముఖం పట్టింది. దీంతో నదీ పరివాహక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో సిబ్బంది నిమగ్నమయ్యారు. సహాయక చర్యలను కలెక్టర్ సుమిత్‌కుమార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికీ చాలా గ్రామాలు ముంపులోనే ఉన్నాయి.

- ముమ్మరంగా సహాయక చర్యలు
- నిలకడగా గోదావరి, శబరి నీటిమట్టాలు

చింతూరు: గోదావరి వరద అర్ధరాత్రి నుంచి తగ్గుముఖం పట్టినా చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో మాత్రం ఆదివారం ఉదయం వరకు వరద పెరుగుతూనే ఉంది. పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో బాధితులు ఇళ్లను ఖాళీచేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. వీఆర్‌పురం మండలం శ్రీరామగిరి, వడ్డిగూడెం, తుమ్మిలేరు, గొందూరు, కొండేపూడి, ధర్మతాళ్లగూడెం, రాజుపేట, కూనవరం మండలంలో కూనవరం, శబరికొత్తగూడెం, కొండ్రాజుపేట గ్రామాలు వరద ముంపులో ఉన్నాయి. చింతూరు మండలంలో కుమ్మూరు, ఉలుమూరు, ఏజీకొడేరుతో పాటు డివిజన్ కేంద్రమైన చింతూరును కూడా వరదనీరు ముంచెత్తింది.

కన్నీటి లోగిళ్లు

ఎగువ ప్రాంతంలో వరద తగ్గుతుందనే సమాచారంతో తమవరకు వరద రాదని ప్రజలు ధీమాతో ఉన్నారు. కానీ ఆదివారం ఉదయం వరకు వరద పెరుగుతూనే ఉండటంతో వరదనీరు పలు ఇళ్లలోకి చేరింది. వరదనీరు తమ ఇళ్లను చుట్టుముడుతున్న తరుణంలో చేసేదిలేక వారంతా వరద నీటిలోనే ముందుగా తమ సామాన్లను రహదారుల పైకిచేర్చి అనంతరం పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. గతేడాది వరద అనుభవంతో చాలామంది ముందుగానే ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లగా కొంతమంది మాత్రం ధీమాతో ఉండిపోయారు.



పూర్తిగా నీటమునిగిన చింతూరు శబరి ఒడ్డు ప్రాంతం

సహాయక చర్యలు ముమ్మరం

వరద తగ్గుతున్న నేపథ్యంలో అధికారులు సహాయక చర్యలను మరింత ముమ్మరం చేశారు. ముంపు గ్రామాలకు లాంచీలు, మర పడవల ద్వారా నిత్యావసరాలు, కూరగాయలు, కొవ్వొత్తులు, పాల ప్యాకెట్లు, టార్పాలిన్లను తరలిస్తున్నారు.

- గ్రామాలకు చేరిన సామగ్రిని ప్రజా ప్రతినిధులతో కలిసి వరద సహాయక సిబ్బంది వరద బాధితులకు పంపిణీ చేస్తున్నారు. బాధితులకు పంపిణీ చేసేందుకు పట్టణ ప్రాంతాల నుంచి ఎప్పటికప్పుడు తాజాగా ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, దొండకాయలు, క్యాబేజీ వంటి కూరగాయలను రప్పిస్తున్నారు.
- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అధికారులకు పలు సూచనలు చేస్తూ త్వరితగతిన ముంపు ప్రాంతాలకు సరకుల సరఫరా జరిగేలా చర్యలు చేపడుతున్నారు. వరద తగ్గుముఖం పడుతున్నందున ఇకపై వాహనాల ద్వారా ముంపు ప్రాంతాలకు సరకులు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

వరద కారణంగా చింతూరు డివిజన్లో 92 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం నిలిచిపోయింది. ప్రస్తుతం వరద తగ్గుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది కృషి చేస్తున్నారు. వరదనీటిలో ప్రాణాలకు తెగించి పడవలపై విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్నారు.

- డివిజన్లోని ఐదు సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీలైనును పునరుద్ధరించామని, వరద మరింత తగ్గిన వెంటనే 11 కేవీ విద్యుత్‌లైను పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని విద్యుత్‌శాఖ ఈఈ యూసఫ్ తెలిపారు. కూనవరం మండలంలో కాచవరం ఫీడర్, చింతూరు మండలంలో మల్లెతోట ఫీడర్ ముంపునకు గురయ్యాయని ఆయన పేర్కొన్నారు.

ఊపిరి పీల్చుకున్న ప్రజలు

కూనవరం: మండలంలో కూనవరం, టేకులబోరు, శబరికొత్తగూడెం, కొండ్రాజుపేట, చినార్కూరు, పంద్రాజుపల్లి, వెంకన్నగూడెం గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు గత ఐదు రోజులుగా పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి వరద తగ్గుతుందనే సమాచారం వారికి కొంత ఊరటనిచ్చింది. వరద పూర్తిగా తగ్గగానే ఇళ్లకు చేరుకుని బురదతో నిండిన ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. వరదనీరు ఇంకా రహదారులపైనే ఉండటంతోరాకపోకలు ప్రారంభం కాలేదు.

ఎటపాక: వరద క్రమంగా తగ్గుముఖం పట్టింది.ముంపు బాధితులు పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి నిత్యావసర సరకులను పడవలపై తీసుకుని ముంపు గ్రామాలకు వెళ్లారు. ఎటపాక, గుండాల, గౌరిదేవిపేట, నందిగామ, చలంపాలెం, నల్లకుంట, మురుమూరు, వీరాయిగూడెం, కన్నాయిగూడెం తదితర గ్రామాల్లోని ముంపు బాధితులకు కూరగాయలు, కందిపప్పు, పాలు పంపిణీ చేసారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధితులకు అండగా ఉండి సేవలందిస్తున్నారు. భద్రాచలం – నెల్లిపాక, నెల్లిపాక – మురుమూరు వరకు కొంతమేర రహదారిపై నుంచి వరద తగ్గుముఖం పట్టింది. రోడ్డంతా బురద మయంగా మారడంతో రాష్ట్ర సరిహద్దులో పోలీసు కాపలాకాస్తున్నారు.

బాధితులకు బాసటగా..

- అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం
- నిత్యావసరాలు, పాలు, కూరగాయల పంపిణీ

చింతూరు: వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటోంది. ఇళ్లను ఖాళీచేసి పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం వరద తాకిడికి గురైన చింతూరు, వీఆర్‌పురం, కూనవరం ఎటపాక మండలాల్లో 250 గ్రామాలు ప్రభావితమయ్యాయి. నాలుగు మండలాల్లో 103 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం 142 గ్రామాలకు చెందిన 17,778 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించింది. పునరావాస కేంద్రాల్లో బాధితులకు తాగునీటితో పాటు వాడుకనీటి సౌకర్యం కల్పించింది. విద్యుత్ అందుబాటులో లేని ప్రాంతాల్లో జనరేటర్ సౌకర్యం కల్పించారు. బాధితులకు నిత్యావసరాలతో పాటు కూరగాయలు, పాలు అందిస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా కేంద్రాల పరిసరాల్లో బ్లీచింగ్, ఫాగింగ్ వంటి పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యం అందించేందుకు వైద్యసిబ్బందిని, బాధితులకు సౌకర్యాలు కల్పించేందుకు గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లను అందుబాటులో ఉంచారు. పునరావాస కేంద్రాల్లో చేపడుతున్న చర్యలను ప్రత్యేక అధికారులతో పాటు మండలస్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



కుయిగూరు పునరావాస కేంద్రంలో బాధితులకు కూరగాయల పంపిణీ



చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం



చింతూరులో వరదనీటిలో సామాన్లు తరలిస్తున్న బాధిత కుటుంబం



మరమ్మతుల నిమిత్తం పడవపై వరదలో వెళుతున్న విద్యుత్ సిబ్బంది



చింతూరులో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ఎటపాకలో బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



వీఆర్‌పురం -కూనవరం మధ్య నీటమునిగిన శబరి బ్రిడ్జి

వరద బాధితులు అధైర్యపడొద్దు

- అన్నివిధాలుగా ప్రభుత్వం అండ
- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్
- ముంపు గ్రామాల్లో పర్యటన

వీఆర్‌పురం: వరద బాధితులు ఏమాత్రం అధైర్యపడొద్దని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ అన్నారు. వరద ముంపునకు గురైన శ్రీరామగిరి గ్రామానికి ఆదివారం బోట్‌లో వెళ్లారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. కొండ మీద గుడారాలు వేసుకొని జీవనం సాగిస్తున్న వరద బాధితులను ఓదార్చారు. వారికి కూరగాయలు పంపిణీ చేశారు.అక్కడి నుంచి నేరుగా మరో ముంపు గ్రామం రాజుపేట వెళ్లి బాధితులను పరామర్శించారు. మండల కేంద్రం రేఖపల్లిలోని వడ్డిగుడెం, వడ్డిగూడెం కాలనీ, ధర్మతాళ్లగుడెం పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులతో మాట్లాడారు. ఎస్పీ కమిషన్ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, తహసీల్దార్ ఎస్.శ్రీధర్, సీఐ గజేంద్ర, ఎంపీడీవో రత్నకుమారి, ఎస్ఐ తెల్లం దుర్గాప్రసాద్, వెలుగు ఏపీఎం కిషోర్ పాల్గొన్నారు.



శ్రీరామగిరిలోని వరద బాధితులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

వచ్చే నెల 3న ఏజెన్సీ బంద్

పాడేరు రూరల్ : మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులు దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా వచ్చేనెల 3వ తేదీన రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో బంద్ నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర తెలిపారు. ఆదివారం పాడేరులోని గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన సంఘం, దండకారణ్య విమోచన సమితి, ఆదివాసీ మహిళ సంఘం, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, గిరిజన సమాఖ్య, ఏఐఎస్ఎఫ్ తదితర సంఘాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసలో సుమారు 160 మంది ఆదివాసీలు మృతి చెందారని, 500 మంది తీవ్రంగా గాయపడ్డారని, 10వేలకు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయన్నారు. సుమార 1200 చర్చిలను తగలబెట్టారని, రూ.వందల కోట్లలో ఆస్తినష్టం సంభవించిందన్నారు. వచ్చే నెల 3న నిర్వహించే బంద్‌కు ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్నపడాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌దేవ్, ఉపాధ్యక్షుడు సుందర్‌రావు, నర్సయ్య, దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి. రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గిరిజన మహిళ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హైమవతి, సీఐటీయూ నాయకురాలు దసమ్మ, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

అల్లానికి రికార్డు ధర

- హైబ్రిడ్ కిలో రూ.180
- దేశవాళీ కిలో రూ.140
- రైతులు, వ్యాపారులకు మంచి ఆదాయం

సాక్షి,పాడేరు: ఎన్నడూలేనివిధంగా ఈఏడాది మన్యంతో పాటు సరిహద్దు ఒడిశాలోని గిరిజన రైతులకు అల్లం సాగు మంచి లాభాలనిస్తోంది. రికార్డు ధరతో వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేయడం వారికి ఊరటనిస్తోంది. మైదాన ప్రాంతాల్లో కిలో రూ.250 నుంచి రూ.300 వరకు అల్లంను రిటైల్ వ్యాపారులు అమ్మకాలు విక్రయిస్తున్నారు. సంత వ్యాపారులంతా మన్యం అల్లంను భారీగా కొనుగోలు చేస్తున్నారు. గత రెండు నెలల నుంచి అల్లంకు రికార్డు ధర నెలకొంది. ప్రస్తుతం హైబ్రిడ్ రకం అల్లంను కిలో రూ.180.దేశవాళీ అల్లం కిలో రూ.140తో వ్యాపారులు కొనుగోలు చేసి విశాఖ, విజయనగరం, గాజువాక, తుని, రాజమండ్రి ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు నేరుగా గిరిజన గ్రామాలకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో గిరిజనులు హైబ్రిడ్, దేశవాళీ అల్లాన్ని విస్తారంగా సాగు చేస్తున్నారు. ఒడిశాలోని కోరాపుట్టు జిల్లా వ్యాప్తంగాను గిరిజన రైతులు అల్లంను భారీగా పండిస్తున్నారు. ఈఏడాది అల్లం కొనుగోలు వినియోగదారులకు భారంగా మారినప్పటికీ రైతులు, వ్యాపారులు మంచి ఆదాయం పొందుతున్నారు.ఆదివారం అరకులోయ మండలంలోని సుంకరమెట్ట వారపుసంతలో వ్యాపారులు అల్లాన్ని భారీగా కొనుగోలు చేశారు.

మహిళా పోలీసుల సమస్యలను పరిష్కరించండి

మహారాణిపేట : మహిళా పోలీసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. మహిళా పోలీసులకు సరైన జాబ్‌చార్ట్ లేనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మధులత వివరించారు. హోంశాఖ మాతృశాఖగా కొనసాగిస్తూ ఉద్యోగ భద్రత కల్పిస్తూ పటిష్టమైన మహిళా పోలీసు చట్టం తీసుకురావాలని, తమ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తేవాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాధిక, జిల్లా అధ్యక్షురాలు నూర్ జహాన్, ఇతర నాయకులు మాధురి, ఈదురి, రాజాన భవాని, శిరీష, హారిక తదితరులు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.



ఎంపీ ఎంవీవీకి వినతి పత్రం అందజేస్తున్న మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

క్రైస్తవుల శాంతి ర్యాలీ

మణిపూర్ ఘటనలకు నిరసనగా మానవహారం

సాక్షి,పాడేరు: మణిపూర్ రాష్ట్రంలోని క్రైస్తవ కుటుంబాలపై హింసాత్మక సంఘటనలు, దుర్మార్గపు చర్యలకు నిరసనగా పాడేరు ప్రాంతంలోని క్రైస్తవులు ఆదివారం జిల్లా కేంద్రం పాడేరులో శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ రాష్ట్రంలో శాంతి ఏర్పడాలని పాస్టర్లు శామ్యూల్, తిమోతి పీఎంఆర్‌సీ జంక్షన్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఫ్రీ ఫర్ మణిపూర్.. సేవ్ మణిపూర్ పేరిట పాడేరు పురవీధుల్లో మత పెద్దలు, క్రైస్తవులు నినాదాలు చేశారు. శాంతి ర్యాలీని అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించారు. ఆయన విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. మానవహారంగా ఏర్పడి మణిపూర్‌లో క్రైస్తవ కుటుంబాలు,ఆదివాసీలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. మోకాళ్లపై నిలబడి ప్రార్థన చేశారు. యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఫౌండర్ అండ్ చీఫ్ రీమలి జాన్ మాట్లాడుతూ మణిపూర్‌లో హింసాకాండను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. పీపీడబ్ల్యూఏ నాయకులు డేవిడ్‌రాజు, పాపిటిరాజు, బిషప్ డాక్టర్ దైవకృప, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు లక్ష్మణరావు, పాస్టర్లు ఎం.బాబూరావు, రత్నం, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవుల మానవహారం

షూటింగ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మధురవాడ : విశాఖ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక మధురవాడలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఇల్లాపు వెంకరావు, సెక్రటరీగా ముద్దాడ కిశోర్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా జనార్దనరావు, ట్రెజరరీగా కాశీవిశ్వనాథ్, కార్యవర్గ సభ్యులుగా సురేష్, రాజేష్, దుశ్యంత్, స్వామిలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సమావేశానికి పరిశీలకులుగా బానోజీరావు, మురళీలు వ్యవహరించారు.

క్లుప్తంగా

అధికారి బంగారు గొలుసు కాజేసిన హిజ్రాలు

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి నుంచి అడ్డతీగల వెళుతున్న స్థానిక అధికారిని ఏమార్చి మెడలోని గొలుసు తస్కరించిన హిజ్రాలు ఉదంతం ఇది. ఉపాధి హామీ కార్యాలయానికి చెందిన అధికారి తెలిపిన వివరాలిలా వున్నాయి. ఆయన శనివారం తన మోటారు సైకిల్‌పై ఎల్లవరం వెళుతుండగా చెట్ల పక్కనుంచి సడన్‌గా వచ్చిన హిజ్రాలు ఒక్కసారిగా మీద పడి డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. జేబులో వున్న చిల్లర ఇస్తుండగా సరిపోదు ఇంకా ఇవ్వాలంటూ చక్కిలిగింతలు పెట్టారని, ఏదో విధంగా వారి బారి నుంచి బయటపడి కొంత దూరం వెళ్లి చూసుకుంటే మెడలో గొలుసు పోయిందని, వెనుకకు చూసేసరికే వారు ఒక కారులో పరారవుతూ కనిపించారని ఆ అధికారి తెలిపారు. ఈ మేరకు అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బధిరుల స్పోర్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా చిరంజీవి


నియామక పత్రాలతో నూతన కమిటీ

అనకాపల్లి టౌన్: జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్ బధిరులు అధ్యక్షుడిగా కొణతాల చిరంజీవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్.శాంతిబాబు, సహాయ కార్యదర్శిగా పల్లా లక్ష్మీప్రసాద్, కోశాధికారిగా ఎం.రాజు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.దేవిప్రసాద్, కాపుశెట్టి తులసి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ బధిరుల సంఘం అధ్యక్షుడు వేదుల చంద్రశేఖర్ వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ పదవీకాలం రెండు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.

కొత్తగా 13 డీసీసీబీ బ్రాంచిలు

- ఈ ఏడాది వ్యాపార లక్ష్యం రూ.2,500 కోట్లు
- గత సంవత్సరంకంటే 20 శాతం అధికం
- ఖరీఫ్ పంట రుణాలు రూ.450 కోట్లు
- ఆర్బీకేకి ఒక సహకార సంఘం ఏర్పాటు యోచన

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) సేవలను విస్తృతం చేస్తోంది. ఒక పక్క వ్యాపార లక్ష్యాన్ని పెంచుకుంటోంది. మరో పక్క పంట రుణాలను విస్తరిస్తోంది. ఇప్పటికే వాణిజ్య బ్యాంకులకు దీటుగా లావాదేవీలను కంప్యూటరీకరణ ద్వారా నిర్వహిస్తోంది. ప్రస్తుతం 30 డీసీసీబీ శాఖలున్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 16, అర్బన్‌లో 14 బ్రాంచిలు నడుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో కొత్తగా 13 డీసీసీబీ శాఖలను ఏర్పాటు చేస్తోంది. విశాఖ జిల్లాలో రెండు (ఆనందపురం, పద్మనాభం), అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు (పెదబయలు, చింతపల్లి), అనకాపల్లి జిల్లాలో తొమ్మిది (రాంబిల్లి, మాకవరపాలెం, నాతవరం, బుచ్చయ్యపేట, గొలుగొండ, చీడికాడ, కశింకోట, రోలుగుంట, సబ్బవరం) చోట్ల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అనుమతి లభించింది. వీటిలో ఆనందపురం బ్రాంచిని ఆగస్టు రెండో వారంలోను, పద్మనాభం బ్రాంచిని ఆగస్టు ఆఖరులోనూ ప్రారంభించడానికి డీసీసీబీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కొత్త బ్రాంచిలు అందుబాటులోకి వస్తే విశాఖ డీసీసీబీ శాఖల సంఖ్య 43కు చేరుకుంటుంది. తద్వారా ఆయా ప్రాంతాల రైతులు, వ్యాపారులకు ఈ బ్యాంకు సేవలు మరింత అందుబాటులోకి వచ్చే వీలుంటుంది. డీసీసీబీ బ్రాంచిల్లో రూ.225 కోట్ల వ్యాపారంతో అనకాపల్లి, రూ.200 కోట్లతో చోడవరం, రూ.180 కోట్లతో మాడుగుల శాఖలు ముందంజలో ఉన్నాయి.

వ్యాపార లక్ష్యం రూ.2,500 కోట్లు

విశాఖపట్నం డీసీసీబీ గత (2022–23) ఆర్థిక సంవత్సరం రూ.2,100 కోట్ల వ్యాపార లావాదేవీలను నిర్వహించింది. ఈ సంవత్సరం దానిని రూ.2,500 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇది గత ఏడాది కంటే 20 శాతం అధికమన్నమాట! గత ఆర్థిక సంవత్సరంలో 55,086 మందికి స్వల్పకాలిక రుణాల కింద రూ.334.79 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద 125 మందికి రూ.5.70 కోట్లను మంజూరు చేశారు. రైతాంగానికి స్వల్పకాలిక రుణ పథకం కింద 5,431 మందికి రూ.262 కోట్లు, కౌలు రైతులకు 745 మందికి రూ.11.41 కోట్లు, 1.111 స్వయం సహాయక సంఘాలకు రూ.49.86 కోట్ల రుణాలు ఇచ్చారు. ఈ ఏడాది రైతులకు ఖరీఫ్‌లో రూ.450 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. గత ఏడాది ఖరీఫ్ పంట రుణాలతో పోల్చుకుంటే ఇది రూ.116 కోట్లు అధికం. మరోపక్క విశాఖ డీసీసీబీలో రూ.980 కోట్ల డిపాజిట్లున్నాయి. వీటిలో రూ.600 కోట్ల వరకు అర్బన్ పరిధిలో ఉన్న బ్రాంచిల నుంచి వచ్చినవే.

సేవలు పెంచి మరింత చేరువ



డీసీసీబీ ద్వారా సేవలు విస్తృతం చేయడం ద్వారా రైతులు, వ్యాపారులకు మరింత చేరువవుతాం. ఇందులో భాగంగానే ఉమ్మడి విశాఖలో కొత్తగా 13 శాఖలను ఏర్పాటు చేయబోతున్నాం. ఈ ఏడాది బ్యాంకు వ్యాపార లక్ష్యాన్ని రూ.2,500 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులకు పంట రుణాలను కూడా పెంచుతున్నాం. రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా 7 శాతం వడ్డీతో స్వల్పకాలిక పంట రుణాలిస్తున్నాం. ఏజెన్సీలో ప్రస్తుతం రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీవోలు) ఉన్నాయి. ఇవి ఎంతో విజయవంతంగా నడుస్తున్నాయి. ఈ సంఘాలకిచ్చిన రుణాల రికవరీ 100 శాతం ఉంది. దీంతో వీటిని మరింత విస్తరిస్తున్నాం.

– డీవీఎస్ వర్మ, సీఈవో, డీసీసీబీ, విశాఖపట్నం

ఆర్బీకేకి ఒక సహకార సంఘం

మరోవైపు ఉమ్మడి విశాఖ జిల్లాలో సహకార సంఘాల సంఖ్యను పెంచాలని డీసీసీబీ యోచిస్తోంది. ప్రస్తుతం 230 వరకు వివిధ రకాల సహకార సంఘాలు ఉన్నాయి. వీటిని రైతు భరోసా కేంద్రానికి ఒకటి చొప్పున 380 వరకు పెంచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటిని ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై సర్వే చేస్తున్నారు.

పార్టీ కార్యకర్తల సంక్షేమానికి కృషి

అరకు ఎమ్మెల్యే పాల్గుణ


సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, తదితరులు

అరకులోయటౌన్: నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే నా ఆశ.. నా శ్వాస అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో ఆదివారం మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడారు. నా ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సేవకే నా జీవితం అంకితం అని, పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. అరకులోయ నియోజకవర్గం ప్రభుత్వం పథకాలు, గడప గడపకు మన ప్రభుత్వం, పార్టీ కార్యక్రమాల్లో ముందంజలో ఉందని, ప్రతీ కార్యకర్త ఉత్సాహంగా పాల్గని ప్రజల వద్దకు వెళ్లి విజయవంతం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీకి మంచి కేడర్ తయారు చేశామన్నారు.రానున్న ఎన్నికల్లో మీ అందరి సహకారంతో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా, సమన్వయంతో పనిచేయాలని, పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమించాలని పిలుపునిచ్చారు.

ప్రజా సేవకే ప్రాధాన్యం

అరకు ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ప్రజలకు విపత్తు వచ్చినప్పుడే నాయకులు అండగా నిలవాలని, తన వంతు సహాయం చేయాలన్న సదుద్దేశ్యంతో తమ ట్రస్టు ద్వారా ఆఖరి రథం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇందులో భాగంగా ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో మృతి చెందితే మృతదేహాలను ఉచితంగా వారి స్వగ్రామాలకు చేరవేస్తున్నామన్నారు. ప్రజా సేవకే ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాడి రమేష్, పలువురు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరలా పాల్గుణ గెలుపునకు సైనికుల్లా పనిచేసి, అత్యధిక మెజార్టీతో విజయఢంకా మోగిస్తామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రాజారమేష్, కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు హస్తినకుమార్, పార్టీ ఇన్‌చార్జి అధ్యక్షుడు లొక్కోయి. లక్ష్మణకుమార్, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్ డి.భాస్కర్, ఎంపీటీసీ ఎల్.బి. భీమరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోయా రాజారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మజ్జి గురు, మహిళ అధ్యక్షురాలు బురిడి రాధ, వార్డు సభ్యుడు కిరణ్, నాయకులు సాంభ, శ్రీరాములు, నర్సింగ్, జీనబందు, నగేష్, బాలరాజు, నొబో, రామచందర్, రామ్మూర్తి, బొంజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం బోటు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం
- రుషికొండ బీచ్‌లో ఘటన

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో పెను ప్రమాదం తప్పింది. ఇద్దరు సందర్శకులు జాలీగా బోటులో షికారు చేస్తుండగా.. అలల ఉధృతికి సముద్రంలో బోటు బోల్తా పడింది. వీరు లైఫ్‌జాకెట్స్ వేసుకోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పోలీసులు, పర్యాటకులు తెలిపిన వివరాలివీ.. చినముషిడివాడకు చెందిన ఇంటి రవి, మధురవాడకు చెందిన బొత్స సురేష్‌లో రుషికొండ బీచ్‌కు వచ్చారు. సముద్రంలో షికారు చేసేందుకు టూరిజం బోటు ఎక్కారు. బోటులో షికారు చేస్తున్న సమయంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ఓ భారీ అల బోటును ఢీ కొట్టడంతో.. బోల్తా పడింది. ఈ ఘటనలో వీరిద్దరితో పాటు బోటును నడుపుతున్న పుక్కళ్ల లక్ష్మణరావు సముద్రంలో పడిపోయారు. వీరు లైఫ్ జాకెట్స్ వేసుకోవడంతో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ వెంటనే ఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని పర్యాటకులు, బోటును సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విషయం తెలుసుకున్న మెరైన్ పోలీసులు బీచ్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. కాగా.. వారం రోజుల నుంచి వరద నీటి ప్రవాహంతో సముద్రంలో నీటి మట్టం పెరగడంతోపాటు అలలు ఉధృతి ఎక్కువగా ఉంది. దీనికి తోడు బలంగా గాలులు వీస్తున్నాయి. ఈ సమయంలో బోటు షికారు నిర్వహించడంపై పలువురు మండిపడుతున్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల విజేత తిరుపతి

అనకాపల్లి టౌన్: విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జాతీయ గ్రాప్లింగ్ (కుస్తీ పోటీలు) అసోసియేషన్ చైర్మన్ దినేష్‌కపూర్ తెలిపారు. స్థానిక గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి మూడో సబ్ జూనియర్ గ్రాప్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాయని, విద్యార్థులు వారికి నచ్చిన దాంట్లో ప్రతిభ సాధించాలని సూచించారు. విద్యతోపాటు, క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 600 మంది క్రీడాకారుల పాల్గొన్నారు. తిరుపతి జిల్లా ప్రథమ స్థానం, అనంతపురం జిల్లా ద్వితీయ, అనకాపల్లి, విశాఖ జిల్లాలు తృతీయ స్థానం సాధించాయి. పోటీలు అనంతరం విజేత క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణరావు, కె.ఎస్.వి.సత్యనారాయణ, గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.జ్యోతిర్మయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్ఆర్ఎస్ మహేశ్వరరావు నేతృత్వంలో రౌతు ఆదినారాయణ స్మారక జిల్లా స్థాయి నడక పోటీలు ఆదివారం నిర్వహించారు.

ముఖ్య అతిథి వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ యు.శుభ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. 30 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయసు గల మహిళలు, పురుషులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. నడక పోటీల్లో విజేతలకు ఆగస్టు 15న జరిగే వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నిఘా మరింత కట్టుదిట్టం


కొయ్యూరులో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ లోకేష్‌కుమార్


రాజవొమ్మంగిలో మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలసిన వాల్ పోస్టర్లు

చింతపల్లి రూరల్: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని బలపం, లోతుగెడ్డ, అన్నవరం ప్రాంతాల్లో పోలీసులు ముందు జాగ్రత్తగా ముమ్మర తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.అన్ని ప్రభుత్వ కార్యలయాల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.సీఐ రమేష్ ఆధ్వర్యంలో నిఘా ముమ్మరం చేశారు.

కొయ్యూరు: మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో బాలరేవుల–కొయ్యూరు రహదారిలో తనిఖీలు నిర్వహించారు. కన్నవరం,బొడ్డుమామిడి,గోధుమలంక, నల్లబిల్లి, పోకలపాలెం, బాలరేవుల గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

రాజవొమ్మంగి: మావోయిస్టుల వారోత్సవాలకు వ్యతిరేకంగా మండల కేంద్రం రాజవొమ్మంగిలో ఆదివారం పలు చోట్ల వాల్ పోస్టర్లు వెలిశాయి. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో చంపుతున్నారని, ప్రభుత్వ ఆస్తులు అయిన బస్సులు తదితర విలువైన సంపదను ధ్వంసం చేస్తూ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న పలు అంశాలు పోస్టర్లలో కనిపించాయి.

వై.రామవరం: సరిహద్దు అటవీ ప్రాంతమైన ఏవోబీలో ఏఎస్ఎస్, సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్ తదితర భద్రత దళాలతో భారీ ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు.

కళాకారుల సంఘ అధ్యక్షురాలిగా విజయ


నూతన కార్యవర్గంతో కళాకారులు

బీచ్‌రోడ్డు: విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం సిరిపురం బిల్డర్స్ అసోసియేషన్ హాలులో సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ జాలాది విజయ, ఉపాధ్యక్షుడిగా త్రినాథరావు, కార్యదర్శిగా గాయకుడు కె.లోకేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా జగదీశ్, కోశాధికారిగా రమణి విజయం సాధించారు. ఎన్నికల అధికారులుగా మాజీ డిప్యూటీ మేయర్ సత్యనారాయణ, మస్తాన్ రెడ్డి వ్యవహరించారు. ఎన్నికల కమిటీ కన్వీనర్ తిరుమలరావు మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, గానం, నృత్యం, నాటకం తదితర అంశాలకు చెందిన సకల కళాకారులతో సంఘం ఏర్పాటైందన్నారు. ఎన్నికైన వారు రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారన్నారు. కమిటీ సభ్యులకు ఎన్నికల అధికారుల నియామకపత్రాలు అందజేసి సన్మానించారు.

వరదలో మునిగి పశువుల కాపరి మృతి


రాముడు మృతదేహం


ఎటపాక : ప్రమాదవశాత్తూ గోదావరి వరదలో మునిగి పశువుల కాపరి మృతి చెందిన ఘటన ఆదివారం నెల్లిపాకలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మల్కనగిరి జిల్లా వెంకటాపురం ఏరియాకి చెందిన దేదారి రాముడు(50), అతడి భార్య గంగమ్మ రెండు సంవత్సరాల నుంచి ఓ రైతు వద్ద పశువులు కాస్తున్నారు. శనివారం ఉదయం పశువులు కాసేందుకు గ్రామ శివారుకు వెళ్లారు. గ్రామం చుట్టూ గోదావరి వరద రావడంతో పశువులు ఇంటికి చేరే సమయంలో వరద నీటిలో దిగాయి. పశువులను తోలుకుంటూ రాముడు కూడా నీటిలో దిగడంతో నీటి లోతు తెలియక మునిగిపోయాడు. అతడి భార్య కూడా పశువులను తోలుకుని ఇంటికి వచ్చేసింది. కానీ రాముడు రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో గ్రామస్తులకు తెలపడంతో కొందరు యువకులు నీటి వద్దకు వెళ్లి చూశారు. అతని జాడ తెలియక పోవడంతో తిరిగి వచ్చి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఉదయం వరద నీటి వద్దకు వెళ్లి చూడగా రాముడు మృతదేహం నీటిపై తేలి ఉంది. మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిమిత్తం పోలీసులు భద్రాచలం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నృత్య కళాకారులకు సత్కారం


చిన్నారిని సత్కరిస్తున్న అతిథులు

సీతమ్మధార: ఏపీ ఎస్సీ బీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బహు భాషా నృత్య కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాలల విద్యాశాఖ రీజినల్ జా యింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ విశాఖ చిన్నారులు ఇండోనేషియాలో ప్రదర్శనలివ్వడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నృత్య కళాకారులు నేహా అక్షయ, సంఘవి, వైష్ణవి, అనురాధను నిర్వాహకులు సత్కరించారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి


రామునాయుడు మృతదేహం

మాడుగుల రూరల్: మండలంలోని పోతనపూడి అగ్రహారంలో విద్యుదాఘాతానికి గురై ముచ్చకర్ల రామునాయుడు(52) ఆదివారం మృతి చెందాడు. వీరవల్లి అగ్రహారం శారదానది బ్రిడ్జి సమీపంలో ఏబీ స్విచ్ ఆన్ చేస్తుండగా, షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వ్యవసాయ కూలీగా పనిచేసే అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ కోరుకొండ భవానీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కోరుకొండ సూరిప్పారావు, సాంబమూర్తి, పరామర్శించారు.

చెరువులో మునిగి రైతు మృతి


అప్పలనాయుడు మృతదేహం

కె.కోటపాడు: మండలంలోని పోతనవలసలో రామసాగరం చెరువులో మునిగిపోయి రైతు నెక్కల అప్పలనాయుడు(55) శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతిపై భార్య నారాయణమ్మ ఆదివారం ఎ.కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ బి.రామకృష్ణ వివరాల ప్రకారం... అప్పలనాయుడు పొలంలో వరి నాట్లు వేస్తున్నారు. సాయంత్రానికి మరికొంత వరి ఆకు అవసరం వచ్చింది. దాంతో తట్టతో వరినారు పట్టుకుని తన పొలానికి వస్తున్నాడు. ఈ క్రమంలో రామసాగరం చెరువు లోపలి నుంచి దాటే సమయంలో మునిగిపోయాడు. రాత్రి అయినా భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. చెరువు వద్ద తేలిపోయిన తట్ట, వరినారు గుర్తించి అనుమానంతో గాలించగా, నీటి అడుగు భాగంలో మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్.ఐ తెలిపారు.

నీటి బొట్టు.. ఒడిసి పట్టు

- భూగర్భ జల మట్టం పెరిగేలా ప్రభుత్వం చర్యలు
- వర్షపు నీటిని భూమిలో ఇంకించేలా ప్రణాళిక
- ప్రభుత్వ స్థలాల్లో 253 ఇంకుడు గుంతల తవ్వకానికి శ్రీకారం
- ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల ఆవరణలో ఏర్పాటు


బుచ్చెయ్యపేటలో నిర్మిస్తున్న ఇంకుడు గుంత


ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అధికారులు

అనకాపల్లి రూరల్: నీరు మనిషికి ప్రాణాధారం.. ఏటా వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి చుక్క నీరు దొరకని పరిస్థితి.. ఈ ప్రభావం భవిష్యత్ తరానికి ప్రమాదంగా మారకముందే ప్రభుత్వం మేల్కొంది. వర్షం రూపంలో భూమిని చేరే ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేందుకు సిద్ధమైంది. వర్షపు నీటిని ఒడిసి పడితే భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయని కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు ఇటీవల రాష్ట్రంలో పర్యటించినప్పుడు ఇక్కడి అధికారులకు తేల్చి చెప్పారు. దీంతో డ్వామా అధికారులు ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణల్లో ఇంకుడు గుంతలు తవ్వించేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రతి మండలంలో కనీసం 5 నుంచి 10 గుంతలు తీయించేలా చర్యలు చేపడుతున్నారు. వీటి నిర్మాణం వల్ల భూగర్భ జలమట్టం పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి మలివిడతలో మరిన్ని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం సంకల్పించింది. దీనికి అనుగుణంగా అధికారులు ప్రజల్లో చైతన్యం తేవడానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు.

జిల్లాలో 253 లక్ష్యం

జిల్లాలో భూగర్భ జలాలు పెంపునకు దోహదం చేసేలా డ్వామా అధికారులు జిల్లా వ్యాప్తంగా 253 ఇంకుడు గుంతలు నిర్మించాలని నిర్ణయించారు. జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి, మాడుగుల, నర్సీపట్నం క్లస్టర్లలో 24 మండలాల్లో వీటిని ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను గుర్తించారు. అనకాపల్లి క్లస్టర్‌లో 60, యలమంచిలి క్లస్టర్‌లో 57, మాడుగుల క్లస్టర్‌లో 72, నర్సీపట్నం క్లస్టర్‌లో 64 గుంతలు తీయించనున్నారు. త్వరలో వీటి పనులను ప్రారంభించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం ఇలా..

ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తవ్వాల్సిన ప్రాంతాలను బట్టి చేపట్టనున్నారు. పెద్ద సైజు ఇంకుడు గుంతకు రూ.74,656 చిన్న సైజుకు రూ.53,200 ఖర్చు చేయనున్నారు. గంతలను తీయించనున్న పనులు మొత్తం ఉపాధి హామీ కూలీలతోనే చేయించనున్నారు. 6 మీటర్ల లోతు ఉండేలా ఇంకుడు గుంతను డిజైన్ చేశారు. సిమెంట్, ఇసుక, కంకర, తదితర సామగ్రిని, ఇంకుడు గంతల ఏర్పాటులో వినియోగించనున్నారు. నిర్ణీత లోతులో వీటిని ఉంచిన తర్వాత ఇసుకను పైభాగంలో ఫ్లైయాష్ ఇటుకలతో చుట్టూ చిన్న పిట్టగోడలాగా కడతారు. దీంతో ఇంకుడు గుంత నిర్మాణం పూర్తయి వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకుతుందని డ్వామా అధికారులు చెబుతున్నారు.


ఎక్కడెక్కడ గుంతలు తీస్తారంటే..

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలు, ప్రభుత్వాస్పత్రులు, బల్క్ మిల్క్ సెంటర్లు, ప్రభుత్వ అధీనంలో నడుస్తున్న అన్ని రకాల రెసిడెన్షియల్ పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ భవనాలు వద్ద ఇంకుడు గుంతల్ని ఏర్పాటు చేయనున్నారు.

ప్రయోజనాలెన్నో...

- ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల జల సంరక్షణ పెరుగుతుంది.
- వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకుతుంది. భూగర్భ జలాల పెంపుదలకు దోహదపడుతుంది.
- బోర్లకు అవసరమైన నీటి లభ్యత శాతం పెరుగుతుంది.
- భవిష్యత్ తరాలకు నీటి కొరత ఏర్పడకుండా ఉపయోగపడతాయి.
- పారిశుధ్య నిర్వహణ మెరుగుపడి దోమల బెడద తగ్గడంతోపాటు రోగాలు దూరమవుతాయి.

భూగర్భ జలాల పెంపునకు దోహదం



ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల భూగర్భ జలాల పెంపునకు దోహదపడతాయి. వీటి వల్ల భూగర్భ జలాలు మరింత పైకి వచ్చే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా 253 గుంతలు తీయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. స్థలాల గుర్తింపు దాదాపుగా పూర్తయింది. భూమిలోకి వర్షపు నీరు చేరడం వల్ల బోర్లలో సమృద్ధిగా నీళ్లు అందుబాటులో ఉంటాయి. సాగునీటి బోర్లకు కూడా ఉపయోగమే.

– ఇ.సందీప్, డ్వామా పీడీ, అనకాపల్లి